సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



వజ్రోత్సవాలు షురూ
వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో▸



అవకతవకలపై స్పందించాలి
పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలని కేయూ జేఏసీ నాయకులు కోరారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.4^0 / 28.4^0
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉండి, సాయంత్రం పొడి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 1,563 ఎకరాల పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో 1,313 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్‌గా మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, మునగ పంటలు, బండ్ ప్లాంటేషన్‌గా (ఒడ్డు చుట్టూ) కొబ్బరిని నిర్ణయించామన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు, చిన్న సన్న కారు రైతులకు 5 ఎకరాల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులను వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 7997725102, 7997725294 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు..

భూపాలపల్లి అర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రామ్‌కుమార్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 10న పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



టేకుమట్ల(రేగొండ): జయశంకర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడల్లో రేగొండ మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన బత్తిని రాంచరణ్ అండర్ 17 విభాగం ఖోఖోలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరజినీకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన బత్తిని రాంచరణ్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మైసన సుమన్, ఉపాధ్యాయులు రమేష్, రాజు, శోభన్, సంతోష్, దేవేందర్, రవీందర్, రాజు, మాలత, శిరోమణి, హైమా, చైతన్య, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కోటంచ హుండీ ఆదాయం రూ.15,28,714



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.15,28,714 వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఆలయ చైర్మన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఆలయ ధర్మకర్తలు గైని కుమారస్వామి, పోగు సుమన్, శెట్టి విజయ, బండి తిరుపతి, ఒన్నాల శంకర్, రవి, భజన భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిసాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి మానవ వికాసానికి తోడ్పడుతాయన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు రాజయ్య, జయపాల్, సాంబమూర్తి, విజిత, రాజయ్య, ప్రసాద్, లింగయ్యలు పాల్గొన్నారు.

డెంగీ పేరిట దోపిడీ!



సాధారణ జ్వరానికి ఆస్పత్రిలో అడ్మిట్
- ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిందంటూ జేబులు గుల్ల
- ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం

భూపాలపల్లి అర్బన్: 'మీ కండీషన్ సీరియస్‌గా ఉంది. ప్లేట్‌లెట్స్ పడిపోయినయ్' ప్రస్తుతం జ్వరంతో జిల్లాకేంద్రంలోని ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా చెబుతున్న మాటలు. సాధారణ జ్వరానికి సైతం ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిందంటూ బాధితుల జేబులు గుల్ల చేస్తున్నారు. ప్రజల్లో డెంగీ భయం.. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అనుకూలంగా మారుతోంది.

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పిల్లలు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ తీవ్ర అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వీరిరాకతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. సర్కారు దవాఖానాల్లో సౌకర్యాలు సరిగాలేక చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. దీనిని అదునుగా తీసుకుంటున్న కొందరు వైద్యులు.. 'మీ కండీషన్ సీరియస్‌గా ఉంది. ప్లేట్‌లెట్స్ పడిపోయినయ్' అంటూ భయపెడుతున్నారు. సాధారణ జ్వరంతో ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా ఇదే మాట వినిపిస్తోంది. సీజనల్ వ్యాధులు వస్తే చాలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు పండుగే. వానాకాలం వారికి కాసుల వర్షం కురిపించే సీజన్‌గా మారుతోంది. మామూలు జ్వరంతో వెళ్లినా సరే.. రూ. వెయ్యి నుంచి రూ.2వేల మందులు రాస్తున్నారని బాధితులు వాపోతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 44 డెంగీ కేసులు నమోదయ్యాయని, అనధికారిక చికిత్స తీసుకుంటున్నవారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని, దీంతో డెంగీ కేసులు తక్కువగా నమోదవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కూతురికి ఇటీవల జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్ చూసి రక్త పరీక్షలు చేశారు. రక్త కణాలు తగ్గాయని డెంగీ వచ్చిందని ఆస్పత్రిలో అడ్మిట్ కావాలని సూచించారు. రక్త పరీక్షలకు రూ.1,500 తీసుకొని, మూడు రోజులు అడ్మిట్ చేసుకొని రూ.15వేల బిల్లు వేశారు.

20వేల కన్నా తగ్గితేనే..

సాధారణంగా ఆరోగ్యవంతుని శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. డెంగీ బారినపడితే వీటి సంఖ్య తగ్గుతుంది. 20వేల కన్నా ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గినప్పుడే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువశాతం మందిలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుదల ప్రారంభమైన మూడు రోజుల తరువాత నుంచి ఇచ్చే బయాటిక్స్, ఇతర ముందులతో సంఖ్య పెరుగుతుందని వివరిస్తున్నారు. దీంతో భయపడాల్సిందేమీ లేదని పేర్కొంటున్నారు.

ఇబ్బందులకు గురికావద్దు..



ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి టెస్టుల పేరుతో ఇబ్బందులకు గురికావద్దు. జిల్లా ప్రభుత్వ ఆస్పతిలో టీహబ్‌లో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. పీహెచ్‌సీకి వెళ్లి రక్త నమూనాలు అందజేస్తే 24గంటలలోపు రిపోర్టు వస్తుంది. మామూలు జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గటం సహజం. రక్తంలో 2 లక్షల నుంచి 4.5లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నా ప్రమాదం లేదు. డెంగీ కేసుల్లో 10శాతం మందికే ఆస్పత్రిలో అడ్మిషన్ అవసరం. కానీ చాలామంది జ్వరం వచ్చిన మరుసటిరోజే వెళ్లి డెంగీ టెస్ట్, సీబీపీ చేయించుకుంటున్నారు. నాలుగైదు రోజుల తర్వాత కూడా ఫీవర్ అలాగే ఉంటే అప్పుడు టెస్టులు చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీరాం, డీఎంహెచ్‌ఓ

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి మరో సారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఇస్సిపేట, పాత ఇస్సిపేట, చింతలపల్లి, మొగుళ్లపల్లి, వేములపల్లి, గుడిపహాడ్, ఎల్లారెడ్డిపల్లె, రంగాపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదిక, బీటీ రోడ్లు, బ్రిడ్జి, అదనపు తరగతులను రూ.11 కోట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రంగాపురంలో సర్పంచ్ బలుగూరి తిరుపతి రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సదయ్య, చిట్యాల ఏఎంసీ చైర్మన్ కొడారి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ నరసింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, ఎంపీటీల ఫోరం మండల అధ్యక్షుడు సుధాకర్, సర్పంచ్‌లు కొడారి సునీత, ధర్మారావు, సరళ శ్రీనివాస్, సమ్మక్క మహిపాల్, మాధవి శ్యాంసుందర్ రెడ్డి, స్వరూప పర్వతాలు, రాజేందర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

టేకుమట్ల(రేగొండ): రైతులు పండించే పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ హరి అన్నారు. శనివారం రేగొండ మండల కేంద్రంతో పాటు నారాయణపురం, రావులపల్లిలో మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డితో కలిసి పత్తి, వరి పంట క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, పత్తి పంటలో రసం పీల్చు పురుగులను గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించి ఎండిపోతుందని దీని నివారణకు ఆక్సీక్లోరైడ్‌తో పాటు స్ట్రెప్టోమైసిన్ తగు మోతాదులో పిచికారీ చేయాలన్నారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చుపురుగుల నివారణకు ఎకరాకు ఫ్లనికామిక్ 75 గ్రాములు లేదా డైపెంథూరోన్ 240 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు.

పాడి పశువు ఎకరం భూమితో సమానం

భూపాలపల్లి రూరల్: ఒక పాడి పశువు ఎకరం సాగు భూమితో సమానమని ఇంటింటా ఆవు లేదా గేదెను పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకన్న సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు వరంగల్ కోఆర్డినేటర్ రాజన్న ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్‌లో రైతులకు పాడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. పశువుల ఎద సమయం, పాలు పితికే విధానం, పశువులకు అందించే ఆహారంపై తదితర వాటిపై అవగాహన కల్పించారు. నాణ్యమైన పశువుల పెంపకాన్ని చేపట్టాలన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా ప్రతీ రైతు పశువుల పెంపకాన్ని చేపట్టి జిల్లాను పశువుల పెంపకంలో ముందుంచాలని కోరారు. సమావేశానికి ముందు పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా జంగేడు పశువైద్యశాలలో డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్ పూలమ్మలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు, సంవర్ధక శాఖ అధికారి రంగారావు, శాస్త్రవేత్తలు రవీందర్, రఘుబాబు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే మహిళా రిజర్వేషన్



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

భూపాలపల్లి అర్బన్: ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సుదీర్ఘ పోరాటాల ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగిందని భారత జాతీయ మహిళా సమస్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలో స్థానిక కొమురయ్య భవన్‌లో శనివారం భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా 3వ మహాసభలు జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా నేదునూరి జ్యోతి జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలను ఒక ఓటు బ్యాంకు రాజకీయంగానే ఈ ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అది ఇప్పట్లో అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మహిళలు అంతరిక్షంలో ప్రయాణిస్తున్న అన్నిరంగంలో రాణిస్తున్న మహిళలను చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధనకు ప్రతి మహిళ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, సోతుకు ప్రవీణ్‌కుమార్, పొంగంటి లావణ్య, పుష్పాల వనిత, సంధ్య, నాగ చందన, జ్యోతి, స్వరూప, రక్షిత, సరిత, శ్రీదేవి, బొమ్మ కవిత, స్వప్న రజిత తదితరులు పాల్గొన్నారు.

బాలసదనాలను చట్టప్రకారం నిర్వహించాలి

- బాలల సంక్షేమ సమితి సభ్యుడు రాజేంద్రప్రసాద్



గణపురం బాల సదనంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

భూపాలపల్లిరూరల్: జిల్లాలోని బాలసదనాలను చట్ట ప్రకారం నిర్వహించాలని బాలల సంక్షేమ సమితి సభ్యుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం భూపాలపల్లిలోని హెచ్‌ఎంఆర్‌డీఎస్, గణపురం మండలంలోని గాంధీనగర్‌లో గల హోమ్ ఆఫ్ లవ్ బాయ్స్ హోమ్‌లను జిల్లా స్థాయి తనిఖీ కమిటీతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా సంబంధిత రికార్డులను, బాలలకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యులు మాట్లాడుతూ బాల సదనాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వసతి గృహంలోని గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆశ్రమ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, బాలల పరిరక్షణ అధికారి రాజ కొమురయ్య, గణపురం, భూపాలపల్లి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గౌతమ్, డాక్టర్ రోషిణి, డీసీపీయూ కౌన్సెలర్ శైలజ, సోషల్ వర్కర్ లింగరావు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, ఆశ్రమ నిర్వాహకులు రాజయ్య, సిస్టర్ అన్నా జాన్ పాల్గొన్నారు.

లక్ష్మీబ్యారేజీతో భూములు సస్యశ్యామలం



మాట్లాడుతున్న పుట్ట మధు

మహదేవపూర్: మేడిగడ్డ (లక్ష్మీ)బ్యారేజీని నిర్మించి ఇక్కడి భూములను సస్యశ్యామలం చేశామని మంథని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. శనివారం మండలంలోని అంబట్‌పల్లి నుంచి శనివారం ఉదయం ప్రారంభమైన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర ప్రతీ గ్రామంలో తిరుగుతూ సాయంత్రానికి మహదేవపూర్ చేరుకుంది. మహదేవపూర్ ప్రధాన కూడలిలో మంథని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధు మాట్లాడారు. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్పాల కృష్ణస్వామి, కోత్తవడ్ల రామన్న, జనగాం పోషయ్య, కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మమత, లింగంపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు జయశ్రీ, చాల్లపద్మ, సర్పంచ్ శ్రీపతిబాపు, అన్నారి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఈ–పంచాయతీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట శనివారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. జిల్లా స్థాయిలో పని చేస్తున్న 32 ప్రాజెక్ట్ మేనేజర్లకు జూనియర్ అసిస్టెంట్ కేడర్ పేస్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించి, చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి కారుణ్య కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్నీ వసతులు, సహకారాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, సభ్యులు అచ్యుత్, రమేష్, సురేష్, ఇమ్రాన్, తిరుపతి, రాజశేఖర్, సుదీర్, రాజు, పవన్‌లు పాల్గొన్నారు.

ఏరియాలో తగ్గిన బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ గనుల్లో బొగ్గు ఉత్పత్తి సెప్టెంబర్ మాసంలో తగ్గినట్లు ఏరియా సింగరేణి ఇన్‌చార్జ్ జీఎం వెంకటయ్య తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటయ్య వివరాలు వెల్లడించారు. గడిచిన మాసంలో భూపాలపల్లి ఏరియాలో 3,53,846 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగాను 1,73,595 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టి 49 శాతంలో నిలిచినట్లు తెలిపారు. సెప్టెంబర్ మాసంలో కురిసిన వర్షాలతో రెండు ఓపెన్‌కాస్టులలో 27 షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందన్నారు. ఓపెన్‌కాస్ట్–3లోకి జూలైలో కురిసిన భారీ వర్షాలతో వర్షపు వచ్చి చేరిందన్నారు. 13 ప్రత్యేక మోటార్లను ఏర్పాట్లు చేసి రోజుకు 146 లక్షల గ్యాలన్ల నీటిని తోడిపోస్తున్నట్లు తెలిపారు. ఇంకా 1,600 వందల లక్షల గ్యాలన్ల నీరు ఉన్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఇల్లందు ఏరియా 146 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి మొదటి స్థానంలో నిలవగా భూపాలపల్లి ఏరియా చివరి స్థానంలో నిలిచిందన్నారు. కార్మికుల సంక్షేమ విషయంలో యాజమాన్యం అన్ని రకాల చర్యలు తీసుకుందన్నారు. సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు జ్యోతి, సురేఖ, తుకారాం, శ్యామ్ పాల్గొన్నారు.

కొబ్బరికాయల టెండర్ ఆదాయం రూ.21.5లక్షలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయానికి కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించేందుకు నిర్వహించిన టెండర్లలో కాళేశ్వరం గ్రామానికి చెందిన రేణికుంట్ల సందీప్ రూ. 21.5 లక్షలకు దక్కించుకున్నాడు. దీంతో ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రాంరెడ్డి, సత్యనారాయణగౌడ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన స్నేహలత



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకుంటున్న స్నేహలత

హన్మకొండ: హనుమకొండ వడ్డేపల్లికి చెందిన సైకాలజిస్టు పైండ్ల స్నేహలత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించారు. గత నెల 24వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 మందితో కూడిన బృందం 24 గంటల పాటు నిర్వహించిన వెబినార్‌లో పైండ్ల స్నేహలత 'వ్యక్తిత్వం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రసంగించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు సాధించారు. దీంతో స్నేహలతను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరు రాంచందర్, డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి, డాక్టర్ ఉల్లాజీ ఎలియాజర్ అభినందించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు.. రిమాండ్

చిల్పూరు: మండలంలోని గార్లగడ్డతండా పంచాయతీ పరిధి కచ్చిర్లతండాలో గత నెల 24వ తేదీన అంగోతు భద్రు హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపల్లి సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం చిల్పూరు ఎస్సై వినయ్‌కుమార్‌తో కలిసి హత్య వివరాలు వెల్లడించారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకున్న భద్రు భార్య రమ, అత్త లావుడ్య బూలీ, చినమామ శంకర్.. గత నెల 24వ తేదీన రాత్రి మద్యం మత్తులో ఉన్న భద్రును కర్రలతో కొట్టిగా కోమాలోకి వెళ్లాడు. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. అనంతరం ముగ్గురు తప్పించుకున్నారు. కాగా, తన తమ్ముడి మృతికి రమ, బూలీ, శంకర్ కారణమంటూ భద్రు సోదరుడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



కేసు మూలాల్లోకి వెళ్తేనే 'నకిలీ' గుట్టురట్టు

- ఫేక్ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్ల కేసు విచారణలో పారదర్శకత అవసరం
- మట్టెవాడ పోలీసులు లోతైన విచారణ చేస్తే మరెన్నో వెలుగులోకి వచ్చే ఛాన్స్
- వీరేనా...ఇంకా ఇతర రాష్ట్రాల్లో ఇలా ఏమైనా జరిగాయా..
- ఏపీ నీట్‌తో దొరికిపోవడంతో ఇప్పటికే రద్దయిన ఏడుగురి ఎంబీబీఎస్ అడ్మిషన్లు



సాక్షి, వరంగల్: కాళోజీ వర్సిటీలో నకిలీ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్లు పొందారని వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో సమగ్రమైన దర్యాప్తు చేస్తేనే అసలైన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ కేసులో విద్యార్థుల పాత్ర ఎంత.. దందాకు సూత్రధారిగా చెబుతున్న విజయవాడలోని కన్సల్టెంట్ నిర్వాహకుడు కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఏ మేరకు సహకరించారన్న విషయాలు విచారణలో వెల్లడయ్యే అవకాశముంటుంది. మట్టెవాడ పోలీసులు, కాళోజీ వర్సిటీ అధికారులు మాత్రం విద్యార్థులకు తెలియకుండానే జరిగిందని అంటూనే వారి తల్లిదండ్రులను శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. దీంతో అసలు ఈ కేసు విషయంలో పోలీసులు ఏ విధంగా ముందుకెళుతారా అన్నది ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న అంశమని చెబుతున్న పోలీసులు.. వారికి తెలియకుండానే ఇది జరిగి ఉంటుందా అన్న దిశగానూ లోతైన విచారణ చేయాల్సి ఉంది. కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఇంత ఉన్నత చదువులు చదివిన విద్యార్థుల ప్రమేయం లేకుండానే నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారా అంటే అది కూడా అనుమానించే అంశమని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెప్పిన అంశాలను నోట్ చేసుకున్న పోలీసులు కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వరరావును పట్టుకునేందుకు ఏపీ పోలీసుల సాయం తీసుకుంటున్నట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుంటేనే ఈ కేసుపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడంతో విచారణలో వేగిరం పెంచినట్లు తెలిసింది. ఒకవేళ అతను దొరికితే ఈ ఏడుగురు విద్యార్థుల విషయంలోనే ఇది జరిగిందా...లేదా ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీట్లు పొందిన వారి విషయంలోనూ నకిలీ ధ్రువపత్రాలు ఏమైనా సమర్పించారా...ఎంత పెద్ద మొత్తంలో చేతులు మారాయనే పూర్తి వివరాలు తెలవనున్నాయి.

ఏపీ నీట్‌తో దొరికిపోయారు..

2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ వర్సిటీనుంచి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోపులు సుబ్రహ్మణ్య సాయి తేజ, వానిపెంట సాయి ప్రతీకారెడ్డి, తమ్మినేని విష్ణు తేజారెడ్డి, తన్నీరు సంజయ్, అరికట్ల హనుమాన్ రెడ్డి, టేకులపల్లి మహేశ్, గేర్లె భార్గవ్ ధర్మతేజ యశ్వంత్ నాయుడు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. వీరంతా ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో చదివినట్లు ధ్రువపత్రాలు పొందుపరిచారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఇలా చదివితే లోకల్ అభ్యర్థుల కింద సీట్లు పొందవచ్చు. దీంతో వీరంతా స్థానిక కోటాలో సీట్లు పొందారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివారు. నీట్ పరీక్ష కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి రాయడంతో అనుమానం వచ్చి ధ్రువపత్రాలతో ప్రత్యక్షంగా వర్సిటీకి రావాలని విద్యార్థులను వివరణ కోరారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. విజయవాడలోని ఒక ఏజెన్సీ నడిపే కామిరెడ్డి నాగేశ్వరరావు అనే వ్యక్తి తమకు తెలియకుండా ధ్రువపత్రాలు పొందుపరిచారని అధికారులకు తెలిపారు. దీంతో ఈ ధ్రువపత్రాలు నకిలీవని తేల్చిన వర్సిటీ అధికారులు వీరి ప్రవేశాలను రద్దు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇందులో భాగంగానే ఆ విద్యార్థుల తల్లిదండ్రులను మట్టెవాడ పోలీసులు శనివారం పిలిచి విచారించినట్లు తెలిసింది. ఈ కేసు పూర్వపరాలపై కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్యను సంప్రదిస్తే పోలీసు విచారణలోనే ఎవరిపాత్ర ఏమిటన్నదీ తేలుతుందనే సమాధానమిచ్చారు.

జోష్ ఫుల్.. సౌకర్యాలు నిల్

- దాహంతో అల్లాడిన క్రీడాకారులు
- పట్టించుకోని నిర్వాహకులు
- దాహార్తి తీర్చిన స్థానిక క్రీడాభిమానులు
- ముగిసిన టెమ్రిస్ 2వ జోష్ క్రీడోత్సవాలు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థల (టెమ్రిస్) ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి 2వ జోష్ క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. అయితే టెమ్రిస్ అధికారుల నిర్లక్ష్యంతో అథ్లెటిక్స్ క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు గురైనట్లు తెలుస్తోంది. స్టేడియంలో కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో స్థానిక క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్రీడాకారులు పోటీల్లో పాల్గొని దాహంతో అల్లాడినట్లు తెలుస్తోంది. కొందరు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిసింది. ఇది గమనించిన స్థానిక క్రీడాభిమానులు మంచినీరు, పండ్లు ఇచ్చినట్లు సమాచారం. క్రీడోత్సవాల నిర్వాహణ, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెమ్రిస్ సెక్రటరీ షఫీయుల్లా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినా కిందిస్థాయి అధికారులు సమన్వయలోపంతో క్రీడాకారులకు కనీసం మంచినీటి సౌకర్యం, తదితర వసతులు కల్పించడంలో విఫలం చెందారని క్రీడాభిమానులు పెదవి విరుస్తున్నారు.

సింథటిక్ ట్రాక్‌పై ఇబ్బందులు..

జేఎన్ఎస్‌లో రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడినట్లు తెలుస్తోంది. షూ అందించకపోవడంతో సింథటిక్ ట్రాక్‌పై రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు టెమ్రిస్ అధికారుల వ్యవహార శైలి ఉందని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. వివిధ కేటగిరీల్లో పాల్గొనడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 బాలబాలికల మైనారిటీ గురుకులాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అసౌకర్యాలపై టెమ్రిస్ అధికారులను సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు

వరంగల్ అర్బన్ : వరంగల్ ఇండోర్ స్టేడియంలో అండర్–14,17 విభాగాల్లో నిర్వహిస్తున్న బాల బాలిక రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ వేడుకలకు అసోసియేషన్ ప్రతినిధి జున్ను ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడల్లో గెలుపొందిన బాలబాలికలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడను వరంగల్‌లో నిర్వహించడం ద్వారా ఇక్కడి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పడుతుందన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము మాట్లాడుతూ అండర్–14 విభాగంలో బాలబాలికల ఫెన్సింగ్ క్రీడలు పూర్తయినట్లు పేర్కొన్నారు. కాగా, అండర్- 14 విభాగంలో లక్ష్మీనారాయణ రెడ్డి, హరి ప్రకాష్, టి. నితీష్ , వి. వరుణ్ , హిప్పి బాలికల విభాగంలో అదిబా గంగోత్రి, చరిత, అనన్య, అనన్య సింగ్, సాయి శరణ్య, శివాని, హర్షిత, బాలుర విభాగం లోకేష్, బి. ప్రకాష్ గెలుపొందారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి




హేమ్లా (ఫైల్)

నెక్కొండ: చేపల వేటకు వెళ్లిన ఒకరు..విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పెద్దకొర్పోలు గ్రామ శివారు రేకులకుంట తండాలో జరిగింది. ఎస్సై జానీపాషా కథనం ప్రకారం తండాకు చెందిన బాదావత్ హేమ్లా (57) గత నెల 29న చేపల వేటకు వెళ్లాడు. తండాకు సమీపంలో ఉన్న కుంటలో విద్యుత్ తీగల సాయంతో చేపలు పట్టేందుకు యత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం నుంచి తీగలను కలుపుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడ ఉన్న రైతులు గమనించి చికిత్స నిమిత్తం నెక్కొండకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు భద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముక్తార్ పాషా.. కార్మిక మార్గదర్శి

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖిలా వరంగల్ : కార్మిక ఉద్యమ నిర్మాణంలో జాతీయ జాతీయ స్థాయికి ఎదిగి అసువులు బాసిన ముక్తార్ పాషా కార్మిక వర్గానికి మార్గదర్శి అని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలు రద్దు చేసి 12 గంటలు అమలు చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణ పెరిగి కార్మికుల హక్కులన్నీ హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను రక్షించుకోవడానికి విశాల కార్మిక ఉద్యమాన్ని నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఎం. శ్రీనివాస్, సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, బొద్దుకుమారస్వామి, నలిగంటి విజయపాల్, రాచర్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ 'చాంబర్' వజ్రోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- జ్యోతి ప్రజ్వలన చేసిన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- కొత్త తరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అధ్యక్షతన రెండు రోజులు నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభలో ఉత్సవాలను రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, స్థానిక ఎమ్మెల్యే నరేందర్.. జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించగా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ జరిగిన చాంబర్ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, జరుగుతున్న 75 ఏళ్ల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వరంగల్ అభివృద్ధిలో చాంబర్ మమేకం కావడంతోనే మెడికల్ కాలేజీ సాకారమైందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ముఖ్య కేంద్రంగా చాంబర్ పనిచేస్తోందన్నారు. వ్యాపారంతో పాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కొత్తతరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. అన్నదాతలు, ప్రజలు, వ్యాపారులతోపాటు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఉండాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు, ఇండస్ట్రీల యాజమానులు సహకారం వల్లే చాంబర్ నుంచి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాశ్.. చాంబర్ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, చాంబర్ భవనానికి మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి.. ఏనుమాముల మార్కెట్ సమీపంలో మార్కెట్ స్థలం చాంబర్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తే తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5కోట్లు కేటాయిస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాష్ట్ర చైర్మన్లు బొల్లం సంపత్‌కుమార్, మెట్టు శ్రీనివాస్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, చాంబర్ మాజీ అధ్యక్షులు టి.రమేష్‌బాబు, దిడ్డి కుమారస్వామి, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తోట సంపత్, ప్రతినిధులు ఎస్ రెడ్డి లింగారెడ్డి, వీరారావు, రాజు కరాణి, సంపత్, సాగర్ల శ్రీనివాస్, వెల్డి చక్రధర్, స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హత్య

- వివాహేతర సంబంధమే కారణమనే అనుమానం?
- పోలీసుల అదుపులో నిందితుడు?



రాజు (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల రాజు(30) హత్యకు గురయ్యాడు. కాళ్లు, చేతులను తాడుతో కట్టి హత్య చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు సమాచారం.. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.మడిపల్లికి చెందిన తుమ్మల రాజు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు.అయితే అన్నాసాగరానికి చెందిన తన బాల్యస్నేహితురాలితో రాజుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇది వివాహేతర సంబంధానికి దారితీసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈవిషయమై పలుమార్లు రాజును హెచ్చరించినా మార్పు రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పట్టుబడ్డడా? ఫోన్ చేసి రప్పించారా?

ఇదిలా ఉండగా, శనివారం ఉదయం నుంచి రాజు, పక్క గ్రామానికి చెందిన తన పార్టీ నాయకుడితో కలిసి అతిగా మద్య సేవించినట్లు స్థానికులు చెబుతున్నారు. తొలుత ఎల్కతుర్తిలోని ఓ వైన్‌షాపులో, ఆ తర్వాత జయగిరిలో.. అనంతరం అన్నాసాగరంలోని శ్మశాన వాటిక వద్ద మద్యం తాగినట్లు తెలిసింది.

అయితే మద్యం సేవించాక.. ఆ యువతి ఇంటికి వెళ్లి పట్టుబడ్డడా? ఫోన్ చేసి రాజును రప్పించి హత్య చేశారా అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. దుండగులు రాజును ఇంటి వద్దే కట్టేసి ఆటోలో తీసుకెళ్లి హత్యచేసి, ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాగా, హత్య అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. రాజును చంపి కాల్వలో పడేసినట్లు నిందితుడు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. ఘటనా స్థలిని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ సందర్శించారు. రాజు పట్టుబడ్డడా? ఫోన్‌చేసి రప్పించి హత్యచేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పేకాట శిబిరంపై దాడి..

- పది మంది అరెస్ట్
- రూ.1,21,250నగదు స్వాధీనం
- రెండు కార్లు, మూడు బైక్‌లు సీజ్



పేకాటరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పేకాట శిబిరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పదిమంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,21,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, మూడు బైక్‌లు, పది సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. సీఐ అబ్బయ్య కథనం ప్రకారం పీఎస్ పరిధి గోపాల్‌పూర్ కల్లు మండువ సమీపంలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న గోపాల్‌పురానికి చెందిన కె.మహేందర్, హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లికి చెందిన బోడ ప్రశాంత్, గోపాలపురం కృష్ణాకాలనీ చెందిన కె.లవన్‌కుమార్, ములుగు మండలం రాంనగర్‌కు చెందిన గాడే రమేష్, భీమదేవరపల్లి మండలం మాణిక్యపురానికి చెందిన గోపి, హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన పల్లె విద్యాసాగర్‌రెడ్డి, హనుమకొండ భవానీ నగర్‌కు చెందిన గొట్టిముక్కల రవీందర్, హనుమకొండ నక్కలగుట్టకు చెందిన రాయిని సుధాకర్, హసన్‌పర్తి మండలం నాగారంలోని సప్తగిరి రైస్ మిల్లు నిర్వాహకుడు పోలసాని వెంకటేశ్వర్లు, గోపాలపురానికి చెందిన దూలం తరుణ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై స్పందించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం స్పందించి ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా తాము ఆత్మర్పణ చేసుకుంటామని కేయూ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కేయూ దూరవిద్య కేంద్రం నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి కొంత సేపు ఆందోళన చేశారు. ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం చేసి ఉద్యోగాలు చేస్తున్న వారికి పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారని మండిపడ్డారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ల అవకతవకల చిట్టాను వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంపై తాము 25 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యమో.. యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమో ప్రభుత్వం తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, జాక్ నేతలు అంబాల కిరణ్, మేడ రంజిత్ కుమార్, రాజునాయక్, నిమ్మల రాజేష్, మాచర్ల రాంబాబు, ఎండీ పాషా, అంకిల్ల శంకర్ , మట్టెడ కుమార్ , అరెగంటి నాగరాజు, కేతపాక ప్రసాద్, ప్రశాంత్, కాయిత నాగరాజు, రమేష్, హర్షవర్ధన్, మనోహర్ , విజయ్ పాల్గొన్నారు. కాగా, సీపీ రంగనాథ్.. విద్యార్థి నాయకులను తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారని సమాచారం. విద్యార్థులు ఇచ్చిన వివరాలను తాను కేయూ వీసీ రమేష్‌కు పంపానన్నారు. దీనిపై వీసీ నాలుగురోజుల్లో సమాధానం ఇస్తారని రంగనాథ్ విద్యార్థులతో అన్నట్లు సమాచారం.